
www.vastavam.in
# వాస్తవం.ఇన్
డిజిటల్ పత్రిక
ఎడిటర్: దండుగుల శ్రీనివాస్
News you can trust
| శుక్రవారం | 04-07-2025 |

## వచ్చే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టిపు వాణిజ్యం

### ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు... పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్యపోయిన పార్లమెంట్ సభ్యులు





# రేవంత్ విగ్రహ పాట్లు..!
# బీఆరెస్ ఆగ్రహ పోట్లు..!!





## వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా విగ్రహాల ఏర్పాటు..

**తెలంగాణ తల్లి, రాజీవ్‌గాంధీ విగ్రహాల ఏర్పాటుపై ఇప్పటికే కేటీఆర్ వార్నింగ్.. బీఆరెస్ ఆగ్రహం..**

**తాజాగా రోశయ్య విగ్రహ ఏర్పాటుపై దుమారం..**

**ఆంధ్రోళ్ల విగ్రహాలు, పేర్లు వద్దనే కదా పోరాటం చేసింది.. మళ్లీ ఇదేంటీ..?**

**మండిపడుతున్న టీసోషల్ మీడియా ఫోరం...!**

**తెలంగాణ కోసం కొట్లాటలో విగ్రహాల అంశం కూడా కీలకమైనదే. ఆంధ్రోళ్ల పేర్లు, ఆ విగ్రహాలు మాకొద్దనే కదా అప్పుడు పోరాడింది. మిలియన్ మార్చి పోరాటంలో ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల ధ్వంసాలు కూడా తెలంగాణ ప్రజాగ్రహానికి, ధర్మపోరాటానికి ఓ నిదర్శనం. ఇప్పుడు మళ్లీ ఈ విగ్రహాల వివాదం తెరపైకి వస్తోంది. కాంగ్రెస్, బీఆరెస్ పార్టీల మధ్య పోరుగా మారింది.**

(దండుగుల శ్రీనివాస్)

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగనే, సీఎంగా రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు.. కేసీఆర్ చేసినవి తను మార్చాలని. అందులో భాగంగా ఆయన తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలే మార్చేశాడు. ఇది జనాలెవరూ కోరుకోలేదు. ఆ పాత విగ్రహం వల్ల జనానికి వచ్చిన నష్టమేమీ కూడా లేదు. కానీ కేసీఆర్ గురుతులు లేకుండా చేస్తానని శపథం పూనిన రేవంత్.. తన హయాంలో ఓ తెలంగాణ తల్లిని ఏర్పాటు చేశానని చెప్పుకోవడానికి ఇది చేసినట్టున్నాడు. దీన్ని బీఆరెస్ తీవ్రంగా ఖండించింది. కేటీఆర్ ఏకంగా తాము వచ్చిన తరువాత ఈ తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసేయిస్తామని ప్రకటించాడు. రేవంత్ మాత్రం ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో అన్ని కలెక్టరేట్లలో ఈ తెలంగాణ తల్లి విగ్రహాలు పెట్టించాలని నిర్ణయం తీసుకున్నాడు. దీనిపై జీవో కూడా విడుదలైంది. ఇక అదే సచివాలయం ముందు .. కేసీఆర్ సర్కార్ తెలంగాణ అమరుల స్థూపం ఏర్పాటు చేద్దామనుకున్న జాగలో రేవంత్.. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించి.. తన స్వామిభక్తి చాటుకున్నాడు. దీనిపైనా కేటీఆర్ గుర్రుమన్నాడు. అసలు తెలంగాణకు, రాజీవ్‌గాంధీకి ఏమిటి సంబంధం..? ఆయనను అక్కడ అత్యవసరంగా ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని.?? ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీన్నీ తీసేయిస్తానన్నాడు. ఇక తాజాగా మరో విగ్రహ వివాదాన్ని తలకెత్తుకున్నాడు రేవంత్. దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఇవాళ ప్రతిష్టాపించనున్నాడు. దీనిపైనా బీఆరెస్ భగ్గుమంటోంది. మరోవైపు తెలంగాణ సోషల్ మీడియా ఫోరం కూడా ప్రభుత్వాన్ని తిట్టిపోస్తోంది. ఆంధ్రోళ్ల పేర్లు, ఆ విగ్రహాలు వద్దంటుంటే మళ్లీ అవే తీసుకొచ్చి ఇక్కడ పెడుతున్నారా..? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. పోయేగాలం కాకపోతే.. ఇవే పనులు అంటూ శాపనార్థాలు పెడుతోంది.

# దేశానికే ఫ్యూచర్ మన సిటీ..!



### పెట్టుబడుల ఆకర్శణలో ముందున్న తెలంగాణ

- అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్ నగరం
- దేశానికి ఫ్యూచర్ సిటీని అందించబోతున్నాం
- ప్రపంచ నగరాలతోనే తమ పోటీ ఉంటుంది
- డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
- మలబార్ గోల్డ తయారీ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్

**వాస్తవం, రంగారెడ్డి:**

హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబ డుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లా డుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యు మెంట్‌ను ఆవిష్కరించ బోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యు మెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు. మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముం దుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కో సం దేశ, విదేశాలకు చెందిన కన్‌స్టలెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాం అని సీఎం తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడు తూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు.

## బీసీ కోటాలో పదవి పొంది బీసీలకు ఏం చేస్తున్నావ్

- పీసీసీ అధ్యక్షుడిపై తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ నాయకుల ఫైర్



**వాస్తవం, హైదరాబాద్:**

బీసీ కోటాలో పీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకున్న మహేశ్ కుమార్ గౌడ్ బీసీల కోసం చేసిందేమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు ప్రశ్నించారు. గురువారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఆ హామీని నిలబెట్టుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీల కోసం ఉద్యమించిన తర్వాతనే బీసీల గురించి ప్రభుత్వం మాట్లాడు తోందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, కో ఆర్డినేటర్ ఆలకుంట హరి, తెలంగాణ జాగృతి నాయకులు సంపత్ గౌడ్, కొట్టాల యాదగిరి, నరేశ్ ప్రజాపతి, కందుల మధు, కంచర్ల శివారెడ్డి, యూపీఎఫ్ నాయకులు రామ్ కోటి, రాసమల్ల బాలకృష్ణ, సల్వాచారి, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ముఖ్య నేతల మౌనమెందుకు

**బీసీల ఓట్లు కావాలి కాని వాళ్లకు రాజకీయ రిజర్వేషన్లు వద్దా**

**మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ లోనే రిజర్వేషన్లపై స్పష్టతనివ్వాలి**

**రైల్ రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునివ్వాలి**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**రైల్ రోకో పోస్టర్ ఆవిష్కరణ**



**వాస్తవం, హైదరాబాద్ :**

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేతలు ఎందుకు నోరు విప్పడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్ రోకో పోస్టర్ ను గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీసీ సమాజం ఉద్యమాలకు దిగివచ్చి రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసన మండలిలో రెండు బిల్లులు ప్రవేశ పెట్టి పాస్ చేసిందన్నారు. ఈ బిల్లులు నెలల తరబడి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్నా కాంగ్రెస్ అగ్రనేతలు వాటిపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్‌లో సభ్యులుగా ఉన్నా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఈ అంశంపై మాట్లాడలేదన్నారు. బీసీల ఓట్లు కావాలి కాని వాళ్లకు రిజర్వేషన్లు వద్దా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులు చట్టరూపం దాల్చేందుకు మద్దతునివ్వాలని కోరుతూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖార్గేకు లేఖ రాశానని తెలిపారు. కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈనెల 8వ తేదీలోపు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీని సమాయత్తం చేయడానికి ఏఐసీసీ మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ కు వస్తున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు తేలకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండిపెండెంట్ కమిటీ ఆధ్వర్యంలో చేయించిన కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

### ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్‌ను ఆపేస్తాం

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం ఈనెల 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని గుర్తు చేశారు. ఆ రోజున ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్ ను ఆపేస్తామని తేల్చిచెప్పారు. రైల్ రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునిచ్చి విజయవంతం చేయాలని కోరారు. దక్కన్ నుంచి ఢిల్లీకి వెళ్లే రైళ్లను ఆపి బీసీ రిజర్వేషన్ల సెగ ఢిల్లీకి తగిలేలా చేయాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు కాంట్రాక్టర్ల కోసమే చేపట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. లేఖలు రాస్తే ప్రాజెక్టును ఆపలేరని.. రాష్ట్ర ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు కోవర్టులు ఉన్నారని కూడా ఆయన అన్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బనకచర్ల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న సంగతి కాంగ్రెస్ ఎమ్మెల్యేనే ఎత్తి చూపారని అన్నారు. తెలంగాణ హక్కులను కాలరాసే ఈ ప్రాజెక్టుపై ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయాలన్నారు. రైల్ రోకోకు బీఆర్ఎస్ మద్దతునిస్తుందా అనే ప్రశ్నపై స్పందిస్తూ.. తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీని.. రైల్ రోకోకు బీఆర్ఎస్ మద్దతునిస్తుందని అన్నారు.